

## ఇవిఎం గొడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి -ముమ్మిడివరం


తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఇవిఎం గొడౌన్ రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తనిఖీ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఇవిఎం గొడౌన్ ను కలెక్టర్ శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. గొడౌన్ కు ఉన్న సీలు పరిశీలించి సంబంధిత రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎం గొడౌన్ వద్ద నిరంతరం పటిష్ట భద్రత కొనసాగుతుందని, అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి రెగ్యులర్ తనిఖీలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో ఎపిఇడబ్ల్యుఐడిసి డిఇ సుబ్బరాజు, రెవెన్యూ సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరపిలేని వాన

- వర్షాలకు నిర్మానుష్యంగా రహదారుల్లో
- పల్లపు ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షం నీరు
- స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి-యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పాఠశాలలకు సెలవు ప్రకటించింది. దుకాణాలు మూత పడ్డాయి. చిరు వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

**రామచంద్రపురం:** అల్పపీడనం తో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ఏర్పడిన ముసురుతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలకు పలు రోడ్లు జలమయం కాగా వ్యాపార వాణిజ్య సంస్థలు మూసివేయాల్సిన పరిస్థితి. వర్షాలకు మెయిన్ రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెలబోయాయి. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలన్నీ మూసివేశారు. ఉదయం నుండి కురుస్తున్న వర్షాలకు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. **మామిడికుదురు:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రహదారులపై ఉన్న గోతుల్లో వర్షం నీరు చేరి అధ్వానంగా మారాయి. 216వ జాతీయ రహదారిలో


ద్రాక్షారామ మెయిన్ రోడ్డులో చేరిన వర్షం నీరు


రావులపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద వర్షం నీరు


ఉప్పలగుప్తంలో వరి చేలల్లో నిలిచిన వర్షపు నీరు

మామిడికుదురు, పాశర్లపూడి, నగరం గ్రామాలలో పలుచోట్ల రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనశోదకులు రాకపోకలకు అవస్థలు ఎదురయ్యాయి మామిడి కుదురులో శివాలయం నుంచి మసీదు వరకు రెండవవీధి రోడ్డు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. పెదపట్నంలో అరటి చెట్లు విరిగిపోయాయని రైతులు వాపోతున్నారు. మామిడికుదురు లో విద్యుత్ తీగలపై కొబ్బరి చెట్టు పడి విద్యుత్తుకు అంతరాయం కలిగింది గోగనమఠంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి ఉదయం నుంచివిద్యుత్ సరఫరా నిలిచిపోయింది పలు గ్రామాలలో లోతట్టు ప్రాంతాలైన కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో చేతి వత్తుల వారు ఇళ్ళ కే పరిమితమయ్యారు. **కపిలేశ్వరపురం:** మండలంలో శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షానికి ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం నిత్యవసరాలు తెచ్చుకునేందుకు కూడా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా రహదారుల సైతం జలమయంగా మారడంతో వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. **రావులపాలెం:** అల్పపీడనం ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు చెరువులను తలపించడమే కాక జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కుండపోతగా కురుస్తున్న వర్షాలు పడుతుండడంతో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలకు సెలవు ప్రకటించడంతో మండల విద్యాశాఖాధికారి మండలంలో అన్ని విద్యాసంస్థలకు సమాచారం అందించారు. మండలకేంద్రం రావులపాలెం తహశీల్దార్ కార్యాలయం రోడ్డు నీటమునిగి ప్రహిస్తుండటంతో ఆపీసు పనిమీద వచ్చే ఫిర్యాదు దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ జలమయం కావటంతో బస్సులు జాతీయ రహదారినే బస్టాండ్‌గా మలుచుకొనే పరిస్థితి నెలకొంది. అధిక వర్షాలు కారణంగా మెట్టరైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు అధిక వర్షాలు కారణంగా తీవ్ర నష్టం వాటిల్లి పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతున్నారు. వర్షప్రభావం ఎక్కువగా ఉన్ననేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైయ్యారు. అల్పపీడన ప్రభావం ఇంకా రెండు మూడు రోజులు కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటనలు జారీ చేస్తుండటంతో రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న కుటుంబాల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. అల్పపీడన ప్రభావంతో రైతులకు,కార్మికులకు, కర్షకులకు ఇబ్బందులు తప్పేలా లేవన్నారు. **ఉప్పలగుప్తం:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి మొదలైన వర్షం ఎడతెరిపి లేకుండా శనివారం రాత్రి వరకూ కురుస్తుంది.దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వర్షాల కారణంగా సెలవు ప్రకటించారు ఏడ తరపులేని వానకు జనజీవనం స్తంభించింది.నాట్లు వేసిన పరిచేలల్లో ముంపు నీరు దిగక నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదేవిధంగా వర్షాలు కొనసాగితే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. **ముమ్మిడివరం:** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగాయి. మండలంలోను, పట్టణంలోను పలు లోతట్టు ప్రాంతాలు, మురుగునీటి కాలువలు, పంట కాలవలు పొంగి ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతంలోని వరి పొలాలు నీట మునిగాయి. పలుచోట్ల రోడ్లపై నుంచి వర్షపు నీరు పొంగి ప్రవహిస్తోంది. ముసురు ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. మండలంలో శనివారం ఉదయం నాటికి 58.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. తుఫాన్ కారణంగా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులపాటు జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండి అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలనూ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని పురాతన భవనాలు, పాఠశాలలు, కళాశాలలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఉన్న విద్యార్థులను ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రానున్న మూడు రోజులపాటు నిరంతరాయంగా వర్షం పడే సూచనలను నేపథ్యంలో వంగి ఉన్న కరెంటు స్తంభాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు ఎక్కడా వేలాడకుండా చూడాలన్నారు. విద్యుత్ లైన్ మ్యాన్‌లంతా క్షేత్రస్థాయిలో ఉండి నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో బలహీనంగా ఉన్న కాజ్ వేలు, కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద రెడ్ ఫ్లాగ్లు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వాహనాలను వీటిపై ప్రయాణించకుండా అవసరమైన చోట తాత్కాలికంగా గడ్డర్లు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ ఆర్ అండ్‌బి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08856-293104.

## మెగా వైద్యశిబిరం ప్రారంభం

### నేడూ కొనసాగనున్న శిబిరం

ప్రజాశక్తి-అమలాపురం


మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

అమలాపురంలో శనివారం పలువురు ప్రముఖులు మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని నల్లా శ్రీధర్, ఆధ్వర్యంలో నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా జిఎస్ఎల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహాయ సహకారాలతో అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం నియోజకవర్గ ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, రోహిణి హాస్పిటల్ డాక్టర్ మూర్తి గారిచే 18 విభాగాల మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. అనంతరం అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మెడికల్ క్యాంపులో పాల్గొని అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. ఈ మెడికల్ క్యాంపులో ప్రధానంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 1న ఆదివారం కూడా కొనసాగుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, కూటమి సభ్యులు వారి సేవలను అందిస్తున్నారు పేదలకు అందుబాటులోకి తెచ్చిన నల్లా శ్రీధర్ ను పలువురు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం


వర్షంలో పింఛన్లు పంపిణీ చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

సెప్టెంబర్ నెల 1న ఇవ్వవలసిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఒక రోజు ముందంటే ఆగస్టు 31న లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసింది. పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**అమలాపురం:** సెప్టెంబర్ 1న ఆదివారం కావడంతో పింఛన్లను ఆగస్టు 31 నే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. పింఛన్ల పంపిణీకి ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. 31న అందుకోలేకపోయిన లబ్ధిదారులకు సెప్టెంబర్ 2న పింఛన్లను అందించాలన్నారు. పట్టణం 2 వ వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ప్రతి నెలా ఒకటో తేదీన అందించే పింఛన్లను ఒక రోజు ముందే శనివారం అందజేశారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసనశెట్టి సుభాష్ రామచంద్రపురం మండలం లోనినెలపర్తిపాడు గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పెంచిన పింఛన్లను సమయానికి ఇవ్వటమే కాకుండా ఆగస్టు నెల్లో 31న పింఛన్లు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదేవిధంగా అన్ని సచివాలయాల్లోనూ ఉదయం నుండి సాయంత్రం లోపు అందరికీ పింఛన్లు అందజేయాలని ఆదేశించారని సాయంత్రానికి 90శాతం పైగా పింఛన్లు పూర్తి చేస్తారన్నారు. సచివాలయం సిబ్బంది మొత్తం వర్షం లెక్క చేయకుండా పింఛన్లు అందజేశారన్నారు. నెలపర్తిపాడులో వాసంశెట్టి సత్యవేణి భర్త వాసంశెట్టి భాస్కరరావు ఇటీవల మరణించడం తో ఆ కుటుంబానికి రూ.25వేల సాయం మంత్రి అందజేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **రావులపాలెం:** ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ఒక్కరోజే నియోజకవర్గంలో 43 వేల పైబడి పింఛన్లను సుమారు రూ.19.5కోట్ల పింఛన్లు అందజేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం పొడగట్లపల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయనని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీ ఆదివారం అయిన కారణంగా ఒక్కరోజు ముందుగా అందచేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు బండారు శ్రీనివాస్, అల్లూరి కృష్ణంరాజు, గ్రామ వైసిపి అధ్యక్షుడు గంధం అన్న వవరం, ఎంపిడిఒ వివి.సాయిబాబు, ఎఒ జి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి నిమ్మ కాయల బ్రహ్మాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పింఛన్ అందని వికలాంగులకు ఎంఎల్ఎ గిడ్డి భరోసా

**పి.గన్నవరం:** అర్హత ఉన్నా పింఛన్ అందని పి.గన్నవరం పంచాయతీ పరిధిలో ముగ్గురు వికలాంగుల కుటుంబాలను శనివారం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పరామర్శించి వారికి భరోసా కల్పించారు. అధికారులను వెంటబెట్టుకుని వికలాంగులైన కుంపట్ల వీర వెంకట సురేష్, చుట్టుగుళ్ళ బాబులు, అలాగే మంచానికే పరిమితమైన మరో వికలాంగుని కుటుంబాన్ని సందర్శించారు. వారికి సాధారణ పింఛన్ వస్తుందని వికలాంగులుగా అర్హత ఉన్న వారికి వికలాంగ అర్హత ఉన్న వారికి పెన్షన్ రావడంలేదని తెలుసుకుని వారి వివరాలు తెలుసుకుని పూర్తిస్థాయి వికలాంగ పెన్షన్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షంలో లంకల గన్నవరం వెళ్ళి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొల్లు రవీంద్రకు రూ.10 వేల పెన్షన్ ఎంఎల్ఎ గిడ్డి అందజేశారు.

### మామిడికుదురు మండలములో 94.48 శాతం

**మామిడికుదురు:** మామిడికుదురు మండల పరిధిలో 18 గ్రామాలలో శనివారం 10,085 పెన్షన్లకు గాను 9,528 పెన్షన్ల పంపిణీ జరిగిందని ఎంపిడిఒ కుసుమ వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావులు తెలిపారు. రూ.4 కోట్ల 12 లక్షల 81వేలు పంపిణీ చేయాల్సి ఉండగా రూ.మూడు కోట్ల 90 లక్షల 31వేలు పంపిణీ చేశామన్నారు. ఊరిలో లేని మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామన్నారు. **కపిలేశ్వరపురం:** వర్షంలో శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పెన్షన్ పంపిణీ ప్రారంభించారు. మండలంలో 10,116 పెన్షన్లకు గాను రూ.4 కోట్ల 21లక్షల 99 వేలు పంపిణీ చేయాల్సి ఉండగా నూరు శాతం పంపిణీ చేసేందుకు కషి చేస్తున్నట్లు ఎంపిడిఒ కొండలరావు తెలిపారు .గ్రామాల్లో లేకుండా కొంతమంది దూర ప్రాంతాల్లో ఉంటున్న కారణంగా సోమవారం వారికి అందజేస్తామన్నారు. **ఆత్రేయపురం :** మండలంలోని 17 గ్రామాల్లో శనివారం 95.21 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు.


అమలాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

మండలంలోని గ్రామాల్లో 9,729 గాను రూ.3 కోట్ల 97 లక్షల78 వేల 5 వందలు పంపిణీనికి 181 మంది సిబ్బంది తెల్లవారుజామున నాలుగు గంటలకే నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి ఉదయం 10 గంటల సమయానికే 80 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపిడిఒ పేర్కొన్నారు. సాయంత్రానికి 95. 21 శాతం అవ్వడంతో సిబ్బందిని ఆమె అభినందించారు. లొల్ల గ్రామానికి చెందిన వృద్ధుడు చిక్కాల వెంకట్రావుకి రాజమహేంద్రవరం ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు..

### ఉప్పలగుప్తంలో 93 శాతం

**ఉప్పలగుప్తం:** మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 7942 పింఛన్లు కు గాను శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ 93 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ కెవి.ప్రసాద్ తెలిపారు. విలసవిల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అమలాపురం ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. **కడియం:** మండపేట పట్టణంలో ఫించన్ ల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు


పొడగట్లపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు

పాల్గొని పంపిణీ చేశారు. కొంతమంది వికలాంగులకు స్వయం గా ఆయనే అందజేశారు. వర్షాన్ని లెక్క చేయకుండా గొడుగు వేసుకుని వార్డుల్లో తిరుగుతూ పంపిణీ ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు అధికారులు, పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఎంఎల్ఎ మాట్లాడుతూ వంద శాతం శనివారం పూర్తి చేసేందుకు ఉద్యోగులు, సిబ్బంది కషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమం లో మండపేట పురపాలక కమిషనర్ బి.రాము, మున్సిపల్ ఉద్యోగులు అశోక్, పాలచర్ల లీలా కష్ణ, వెల్ఫేర్ సెక్రటరీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఒత్తిడికి గురవుతున్న సచివాలయ ఉద్యోగులు

**అంబాజీపేట:** పింఛను పంపిణీ కోసం ప్రభుత్వం మూడు రోజులు సమయం ఇస్తే అధికారులు మరింత ఉత్సాహంతో మూడు రోజులు ముందు నుంచి పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి సమావేశాలు జరిపి వారిపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు వినికిడి. రాష్ట్రమంతా వర్షాలు కురుస్తుంటే తెల్లవారు జామున నాలుగు గంటలకు పించను పంపిణీ ప్రారంభించి 8 గంటలకు పూర్తి చేయాలని అధికారులు దృష్టి సారించడం వలన సచివాలయ సిబ్బంది ఉరుకులు పరుగులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.


పి.గన్నవరంలో వికలాంగుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గిడ్డి


విలసవిల్లిలో పింఛన్ అందజేస్తున్న అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు

### కార్టూ'నిజం'




## రాఘవేంద్రరావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆలమూరు


ఉద్యోగ విరమణ చేసిన రాఘవేంద్రరావు దంపతులను సత్కరిస్తున్న ఉన్నత శ్రేణి కార్యదర్శి గోవిందరెడ్డి

ఎఎంసి సూపర్ వైజర్ రాఘవేంద్రరావు సేవలు ఎనలేనివని ఎఎంసి ఉన్నతశ్రేణి కార్యదర్శి పిఎం.గోవి ందరెడ్డి కొనియాడారు. ఎఎంసి కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సూపర్‌వైజర్ డి.రాఘు వేంద్రరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్ర వృత్తిలో అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాగే రిటైర్డ్ ఎఎంసి ఉన్నత శ్రేణి కార్యదర్శి జివివి.శెట్టి మాట్లాడుతూ రాఘవేంద్రరావు లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని, ఏ పని చెప్పినా చేద్దామని ముందుకు నడిచేవారన్నారు. అలాగే రాఘవేంద్రరావు మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఉన్నతశ్రేణి అధికారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అలాగే సిబ్బంది సహాయక సకారాలతో ఈ వృత్తిని నిర్విఘ్నంగా పూర్తి చేసుకున్నానని అన్నారు. అలాగే పలువురు వక్తలు, బంధుమిత్రులు రాఘవేంద్రను కొనియాడుతూ మాట్లాడారు. అనంతరం రాఘవేంద్రరావు దంపతులను శాలువాలు కప్పి, మెమెంటోలు బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి ఎఎంసి సూపర్‌వైజర్ ధనుంజయ వర్మ, డిఇఒ ప్రసాద్ రావు, గంగాధర్, అచ్యుత్ కిరణ్, రాంబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భీమేశ్వర దేవస్థానం ఇఒగా దుర్గా భవాని

ప్రజాశక్తి-రామచంద్రపురం


అల్లు వెంటక దుర్గా భవాని

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఇఒగా అల్లు వెంకట దుర్గా భవాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జ్యువలరీ అధికారిగా పనిచేస్తున్న ఆమె పిఠాపురం గుప్తేశ్వర స్వామి దేవస్థానం, ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఇన్చార్జ్ ఇఒగాను నియమితులయ్యారు. ఇప్పటివరకు ద్రాక్షారామంలో ఇఒగా పనిచేసిన తారకేశ్వరరావు ను ఎండోమెంట్ కమిషనర్ ఫాలో ఆరోపణలతో సస్పెన్షన్ కావడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా దుర్గా భవానీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## 'గుడ్లవల్లేరు' ఘటనపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల్లో అమానుష ఘటనకు కారణమైన యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కర వర్మ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సభ్య సమాజం సిగ్గుపడేలా వాష్ రూముల్లో సిసి కెమెరాలు అమర్చడం అమానుష ఘటన అన్నారు. దోషులను గుర్తించి శిక్షించాలన్నారు.

## బాధితునికి పర్సు అప్పగింత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రోడ్డు మీద దొరికిన పరుసును పెద్దల సమక్షంలో బాధితునికి ఇద్దరు వ్యక్తులు అప్పగించారు. ఈ సంఘటన కామనగరువు గ్రామ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇవి.. కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామం గిడ్డివారిపేటకు చెందిన గిడ్డి సత్యప్రసాద్ విజయ్‌కుమార్, కుండలేశ్వరం గ్రామానికి చెందిన గెద్దా భూషణం కామనగరువు వచ్చారు. అక్కడనుండి కర్రలు కొనుగోలు చేసేందుకు ఎర్ర వంతెన వద్దకు వెళ్లి తిరిగి కామనగరువు వస్తుండగా మార్గమధ్యలో వారికి పరుసు దొరికింది. ఆ పర్సులో రూ.10వేల నగదు, వివిధ కార్డులు ఉన్నాయి. అది అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామం మాకేవారి పేటకు చెందిన అయితాబత్తుల చినబాబుకు చెందినదిగా గుర్తించి అడ్రస్ కోసం ప్రయత్నించారు. అతని పర్సులో ఉన్న అమలాపురం సేఫ్ ఆస్పత్రి ఒపి కార్డు ఆధారంగా పరుసు బాధితుడి అడ్రస్ కోసం ఆసుపత్రికి ఫోన్ చేశారు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఫోన్ నెంబర్‌తో బాధితుడికి సమాచారం అందించారు. గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ తదితరుల సమక్షంలో శనివారం బాధితుడు చినబాబుకు పరుసు అప్పగించారు. పరుసు అందించి విజయప్రసాద్, భూషణంను అందరూ అభినందించారు.

## గణపతి మండపాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

గణపతి మండపం ఏర్పాటుకు సంబంధించి సింగిల్ విండో క్లియరెన్స్ విధానంలో అనుమతి కొరకు ఆన్ లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యుల వెబ్‌సైట్‌లో మండపం తదితర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకి వెళ్తుందని, ఆయన ఆధ్వర్యంలో పురపాలక అగ్నిమాపక విద్యుత్ శాఖల సిబ్బంది తో కూడిన బందం మండపాలను ఏర్పాటు చేసే ప్రదేశం సందర్శించి నిబంధనలకు అనుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్ తో నిరభ్యంతర పత్రం అందిస్తారన్నారు. అనుమతికి అవసరమైన రుసుము వివరాలకు సంబంధించిన తెలియజేస్తారన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావారణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని సర్పంచ్ గుణ్ణం రాంబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గుమ్మిలేరులో వనం - మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

# నేరాలు ఘోరాలు

## మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పిల్లంక పంచాయతీ గోపులంక కొత్త కొంపలు ప్రాంతంలో ముగ్గురు యువకులు శనివారం మద్యం మత్తులో ప్రయాణికులపై దాడి చేసి గాయపరిచారని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. గోపులంక డీలర్ మండ రామసుబ్రహ్మణ్యం మహేశ్వరరావు గ్రామం నుంచి యానాం వెళ్తుండగా కొత్త కొంపలు వద్ద దారికి అడ్డుగా ఉన్న యువకులను పక్కకు తప్పుకోమన్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు మహేశ్వరరావుపై దాడి చేశారు. అదే సమయంలో యానాం సినిమాకు వెళ్తున్న మహేశ్వరరావు, ఆయన కుమారులు సంతోష్, కృష్ణ వారిని వారించడానికి ప్రయత్నించారు. దీంతో వారిపై బీరు సీసా పగలగొట్టి దాడి చేశారు. అదే సమయంలో రహదారిపై వెళ్తున్న మరో ప్రయాణికుడు పితాని శ్రీరాములు తల పైన బీరు బాటిల్‌తో కొట్టడంతో అతనికి తలపై తీవ్ర గాయం అయింది. మరో నలుగురు ప్రయాణికులపైన మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేశారు. ఈ దాడిలో తన రెండు బంగారు గొలుసులను మద్యం సేవించిన యువకులు లాక్కున్నారని మహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఒక బంగారు గొలుసు యువకుల జేబు నుంచి స్థానికులు గుర్తించి ఇచ్చారని, ఇంకొక బంగారు గొలుసు దొరకలేదన్నారు. తన మొబైల్ ఫోను నేలకేసి కొట్టడం వల్ల పగిలిపోయిందని మహేశ్వరావు అన్నారు. దాడికి పాల్పడిన యానాం జిఎంసి బాలయోగి నగర్‌కు చెందిన యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరు మైనర్లని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - సామర్లకోట

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్ఐ పివిఎస్.మూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను కాకినాడ జిల్లా కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిలో ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఒక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

ఆటో డ్రైవర్లు నిబంధన పాటించకపోతే చర్యలు తప్పవని సిఐ ఎం.గీతా రామకృష్ణ అన్నారు. శనివారం తుని పట్టణంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్కూళ్లు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు యూనిఫారం లేకుండా నిర్లక్ష్యంగా ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు ఫైన్ వేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వానలు.. వ్యాధులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను ఒక పక్క వానలు... మరోపక్క వ్యాధులు కుదిపేస్తున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభించటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాధులు పంజా విసురుతున్నాయి. వారం రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిట కిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రయివేటు వైదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రక రకాల పరీక్షల పేరుతో ప్రయివేటు ఆస్పత్రుల యాజామాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లుపెడుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం జ్వరాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించట్లేదు. ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని చెబుతున్నా.. చాలా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎవరూ రాలేదని చెబుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని ధవళేశ్వరంలోని వార్ఫ్, లాకులైను ప్రాంతాల్లో నేటికీ సర్వే జరుగలేదు. అక్కడ పారిశుధ్యం లోపించడంతో మలేరియా కేసులు వెలుగుచూశాయి. అయితే బాధితులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించడంతో వీటిని లెక్కలోకి తీసుకోవట్లేదు. గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. పదిరోజులు క్రితం ఎంఎల్ఎ, కలెక్టర్ పర్యటించారు. ఆ రెండు రోజులు హడావుడి తప్ప ప్రస్తుతం ఎక్కడా పనులు మాత్రం జరగట్లేదు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**దిగిరానంటున్న ధరలు**

నిత్యావసర సరుకుల ధరలు కిందకు దిగనంటున్నాయి. బియ్యం ధరలకు రెక్కలొచ్చిన విషయం విధితమే. సన్నరకం కేజీ బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.60 పై మాటే. ఉల్లిపాయలు ఇప్పటికే కొండెక్కాయి. పప్పులు, ఇతర అపరాల ధరలూ డబుల్ సెంచరీలకు దగ్గరలో ఉన్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయి. తాజాగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కూరగాయల ధరలు మళ్లీ ఆకాశాన్నంటే పరిస్థితులు లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో వైపు ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే ఇప్పటి వరకూ అందించింది. ఈ నెల పంచదార పంపిణీ చేస్తామని చెబుతోంది. అయితే దీని అమలు చూడాలి. గతంలో 11 రకాల నిత్యావసర సరుకులు అందజేసిన విషయం విధితమే. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**క్లోజర్ పనులు లేక ఆందోళన**

పంట కాల్వల ఆధునికీకరణ పనులను ప్రభుత్వం అటకెక్కించటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వారిలో ఆందోళన మరింత పెరిగింది. గుర్రపు డెక్క తొలగింపు పనులకు నిధులు కేటాయించినా నతత్తనడకన పనులు సాగుతున్నాయి. జిల్లాలో 5.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది జూన్1న సాగు నీరు విడుదల చేశారు. శివారు భూములకు నీరు రాకపోవడంతో జూన్ నెలాఖరు నాటికి రైతులు సాగు ప్రారంభించే అవకాశాలు సన్నగిల్లాయి. పంట కాలువల ఆధునికీకరణ, మీడియం, మైనర్, మేజర్ డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు, వరదలు వస్తే అన్నదాతకు కష్టాలు తప్పేలా లేవు.




**ముసురు ముంపు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వారాంతంలో వర్షాలు జోరుగా కురిశాయి. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మరోవైపు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నదికి వరద నీరు క్రమ క్రమంగా చేరుతోంది. దీంతో పరివాహక ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## మున్సిపల్ డిఇఇ సస్పెన్షన్

ప్రజాశక్తి - పిఠాపురం

పురపాక సంఘం డిఇఇ ఎస్.భవానీ శంకర్‌ను సెస్పెండ్ చేస్తూ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిఇఇ భవాని శంకర్‌లు ఒకరినొకరుపై ఆరోపణలు చేసుకుంటూ వ్యక్తిగతంగా దూషించుకున్నారు. ఈ సంఘటనపై మున్సిపల్ ఆర్‌డి నరసింహారావు, కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. నివేదికను ఆధారంగా చేసుకుని డిఇఇని సెస్పెండ్ చేయాలని కలెక్టర్ సిపార్సు చేశారు. ఈ నేపథ్యంలో భవాని శంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## కోరంగి అభయారణ్యంలో ట్రైనీ అధికారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీ ద్వారా రాజమహేంద్రవరంలో శిక్షణ పొందుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారులు శనివారం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనూష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ మడ అడవుల ప్రాముఖ్యతను, హోప్ ఐలాండ్ యొక్క విశిష్టత, మడ జాతికి చెందిన వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి వివరించారు. సముద్ర తాబేల్ల సంరక్షణ, మడ అడవులలో నాటు సారా అరికట్టే విధానం వివరించారు. మడ జాతికి చెందిన మొక్కల పేర్లను తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎవి.రమణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతరం

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్ నందు వైస్ ఛైర్‌పర్సన్ పి.జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ర్యాటిఫికేషన్ అంశాలపై కౌన్సిల్ అభ్యంతర వ్యక్తం చేసింది. తొలుతగా మాజీ కౌన్సిలర్ సారా మీరయ్య మృతికి కౌన్సిలర్లు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. సమస్యల ప్రస్తావన లేకుండా అధికారుల మధ్య కొట్లాటతో వాడి వేడిగా సమావేశం సాగింది. 105 అంశాలు చర్చకు రాగా ఆమోదం పొందకుండా ఉన్న పనులను ర్యాటిఫికేషన్ ద్వారా శంకుస్థాపనలు చేసి పనులు చేస్తున్నారని, అటువంటపుడు కౌన్సిలర్లు దేనికి అని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. ఏజెండాలో పేర్కొన్న ర్యాటిఫికేషన్ పనులన్నింటిని నిలిపి వేయడానికి ఆమోదం తెలిపారు.

## గండేపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని జాతీయ రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## 2న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజులు పురస్కరించుకుని సెప్టెంబర్ 2న పి.మల్లవరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు విఆర్ఎన్‌బి.ప్రసాద్ తెలిపారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో ఉదయం 8 గంగల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

## శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామిని ఎంఎల్‌సి పి.హరిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు ప్రసాదాలు, స్వామి ఫోటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో భారీగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. వ్యాపార సముదాయాలు మూతబడ్డాయి. చేనేత మగ్గాల వద్ద చమాయింపు రావడంతో మగ్గాలకు బ్రేకులు పడ్డాయి.

## మెకానికల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 3, 5 సెమిస్టర్ విద్యార్థులు కొరకు అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సదస్సులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ యూనివర్సిటీ మెకానికల్ ప్రొఫెసర్. పి.వి.మణివణ్ణన్ పాల్గొని 'ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వెహికల్స్ టెక్నాలజీ' అనే అంశంపై విశదీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఉదాహరణలతో నివృత్తి చేశారు. యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తరచు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందివ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.శరవణన్, డాక్టర్ బి.హెచ్.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.















## యానాం వార్తలు




ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

## లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక గాజుల వారి వీధిలో ఉన్న పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ చేసిన సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్‌కి త్వరలో శాశ్వతంగా ఉండటానికి భవనం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా గవర్నర్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన వేలూరు సూర్యనారాయణ (మాజీ డిస్టిక్ గవర్నర్ ) ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా డివివి.సత్యనారాయణ, సెక్రెటరీగా నల్లాం సురేష్, ట్రెజరీ కనకాల నరసింహమూర్తి, వైస్ ప్రెసిడెంట్స్‌గా బెజవాడ నిరంజన్, గొల్లపల్లి వీర్రాజు, ఛైర్‌పర్సన్ పులవర్తి వెంకట రమణమూర్తి, మెంబర్ షిప్ ఆఫ్ ఛైర్‌పర్సన్‌గా చింతపూడి సత్యనారాయణ, మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా అరిశెట్టి రాజేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

## నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - యానాం

మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు పుదుచ్చేరి సహకారశాఖ ది యానాం కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 21న నిర్వహించారు. ఈ నేపథ్యంలో కో-ఆపరేటివ్ నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవం అయింది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్యానెల్ నుంచి ఎక్కువమంది డైరెక్టర్లు ఎన్నికవ్వడంతో శనివారం తన స్వగృహంలో సమావేశం నిర్వహించి కమిటీని ఏకగ్రీవం చేశారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రెసిడెంట్‌గా లంక విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్‌గా కమిడి విజయకుమార్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. అనంతరం ఎన్నికైన వారిని మల్లాడి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, మున్సిపల్స్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

## ఎంఎల్ఎను కలిసిన దరియాలతిప్ప రైతులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను తన స్వగృహంలో దరియాలతిప్ప ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు. వరద తాకిడితో పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని, అందుచేత పంట పొలాల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఓఎన్‌జిసి అధికారులతో మాట్లాడి రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి, కోరుకొండ ఆనందరావు, రాంబాబు, సబ్బతి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

## ముగిసిన ఎపిఎస్ఎస్‌డిసి ప్రోగ్రాం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన ఐదు రోజుల శిక్షణ శనివారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో పలు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎస్.వరప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ సిహెచ్‌వి.రాఘవేంద్ర, విభాగాధిపతి డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి, వర్క్ షాప్ కో ఆర్డినేటర్ డివి.రవికుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆలయానికి రూ.97.40 వేల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.97.40 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.29,910, అన్నదాన విరాళాల ద్వారా రూ.53,578, కేశఖండన ద్వారా రూ.5,840, తులాభారం ద్వారా రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.7,875 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణార్యులు, సిబ్బంది సేవలందించారు.



అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

## డివిజన్లో 97.2 ఎంఎం వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 97.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్‌డిఒ జె.సీతారామారావు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దాపురంలో 12.8, గండేపల్లిలో 8.2, తొండంగిలో 6.4, ప్రత్తిపాడులో 7.4, కిర్లంపూడిలో 6.8, జగ్గంపేటలో 2.4, ఏలేశ్వరంలో 18.2, శంఖవరంలో 11.8, రౌతులపూడిలో 2.6, తునిలో 10.0, కోటనందూరులో 11.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని తెలిపారు.

## ప్రమాదకరంగా రహదారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

అసలే వర్షాకాలం దానికి తోడు రహదారులు గోతులమయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై నిరంతరం పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారిన రహదారుల తీరు మారలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి. మల్లవరం, పోలేకుర్రు పంచాయితీల సరిహద్దు ప్రాంతంలో రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతం నుంచి పి. మల్లవరం పంచాయతీ మెయిన్ రోడ్డు వరకు రహదారి గుంతలు పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ గుంతలు పూడ్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్నానఘట్టం వద్ద గరుడ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి లో బాల బాలాజీ స్నానఘట్టం వద్ద దాత సహకారం తో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాత మురమళ్ళ వాసులు చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, యాత్రికులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.



బాల బాలాజీ స్నాన ఘట్టం వద్ద ఆవిష్కరించిన గరుడ విగ్రహం

## అరటి తోటలు ధ్వంసం చేస్తున్న పందులు


ప్రజాశక్తి-అంబాజీపేట

మండలంలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటలను పందులు ధ్వంసం చేస్తున్నాయి. మాచవరం, వాకలగరువు, తొండవరం, నందంపూడి తదితర గ్రామాలకు అరటి మార్కెట్ అందుబాటులో ఉండడంతో రైతులు అరటి పంట సాగు చేస్తున్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వేరే ప్రాంతాల నుంచి అరటి దుంపలు తెచ్చి సాగు చేపట్టారు. పిలకలు వేసే సమయంలో మొలకలు లేతగా ఉన్న సమయంలో పందులు వచ్చి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయమై రైతులు పలు సార్లు పంచాయతీ కార్యదర్శులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పందుల పెంపకం దారులు, రైతులతో కలసి సమావేశమై పందులను బయటకు వదలకుండా జాగ్రత్తలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. హామీ విస్మరించి రాత్రి సమయాల్లో పందులను వదిలివేస్తుండడంతో అరటి తోటలు ధ్వంసం చేస్తున్నాయి. పందుల పెంపకం దారులు ఫార్మ్ ఏర్పాటు చేసుకుని బయటకు వదలకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పందులు ధ్వంసంచేసిన అరటి తోట

**సగం పంట నష్టపోయాను**



మాచవరం డైలీ మార్కెట్ సమీపం పొలంలో ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాలు అరటి పంట సాగు చేశాం.. మొత్తం రూ.లక్ష 50 వేలు పెట్టుబడి పెట్టగా పందులు సుమారు 60 నుంచి 65 అరటి చెట్లు ధ్వంసం చేశాయి. సుమారు రూ.30 వేల వరకూ పంట నష్ట పోయాం. ఇలా కొనసాగితే ఈ ప్రాంత రైతులు అరటిపంట సాగుకు విరామం ప్రకటించ

-కొలిశెట్టి భాను ప్రసాద్, అరటి రైతు, మాచవరం